# పుస్తక పరిచయం




**‘తింటే గారెలే తినాలి - వింటే భారతం వినాలి‘** అన్న సామెత తెలియని తెలుగువారుండరు. మానవజాతి చరిత్రలోనే అత్యంత నైపుణ్యం కల స్క్రీన్ ప్లే రచయిత వ్యాసుడు అని కూడా చాలామంది అంగీకరిస్తారు. అంత విశిష్టమైన మహాభారతం, చదివిన ప్రతిసారీ కొత్తగా ఉంటుంది, ప్రతిసారీ ఇంకేదో సూక్ష్మాంశం అర్థమౌతుంది. వందలాది పాత్రలు, వేలాది సన్నివేశాలు ఉన్న మహాభారతం నిజంగా మహేతిహాసం. భారతంలో ప్రధాన కథకు తోడుగా అనేక ఉపాఖ్యానాలు కూడా ఉన్నాయి. ఐతే ఈ ఉపాఖ్యానాలు వ్యాసుడు రాసినవి కాదని, అవన్నీ కాలక్రమంలో ఎవరెవరో సంస్కృతపండితులు రాసి చేర్చినవని కూడా ఒక వాదన ఉంది. ఆ విధంగా ఆనాడు ప్రజలు చెప్పుకున్న జానపద కథలను అనుకరిస్తూ, వాటి ఆధారంగా చేసుకుని పండిత కవులు కల్పించిన కొన్ని కథలు సంస్కృత మహాభారతంలో చోటు చేసుకున్నాయి . అలాంటి జానపద కథాంశాల కథల గురించి ఈ పుస్తకంలో విస్తృతమైన వివరణ ఉంది. గ్రంథ రచయిత డా.జయదేవ్‌గారు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షులుగా పనిచేసి పదవీవిరమణ చేశారు. వారి కలం నుంచి వెలువడిన ఈ విశిష్టగ్రంథంలో మహాభారతంలోని ఉపకథలు అత్యంత సమగ్రంగా, విశదంగా చర్చించబడ్డాయి. చాలా లోతైన పరిశోధన, విశ్లేషణా ఫలితాలు ఈ పుస్తకంలో కథావివరణలు. డా.జయదేవ్‌గారి పరిశీలన ప్రకారం ఆది, శాంతి, అనుశాసన పర్వాల్లో అచ్చమైన జానపద కథలు ఎక్కువగా ఉన్నాయి. వన, సభ, ద్రోణ, కర్ణ, శల్య పర్వాల్లో ఒకటి, రెండు చొప్పున ఉన్నాయి. వీటిలో 24 కట్టుకథలు, 9 ప్రాణి కథలు, 8 నీతి కథలు, 6 అద్భుత కథలు మొత్తం కలిపి 47 ఉన్నాయి. ఈ ‘మహాభారతంలో జానపద కథాంశ కథలు‘ అనే గ్రంథంలో ఈ 47 కథల గురించిన విశ్లేషణ ఉంది. కేవలం ఈ కథలే కాక, ముందులోనే జానపద కథల స్వరూప స్వభావాలను వివరించారు. మొత్తం ఐదు అధ్యాయాల్లో ఈ కథలను విశ్లేషించిన అనంతరం కవిత్రయం వారు తమ తెలుగు భారతంలో చేసిన ఔచిత్యవంతమైన మార్పులను రామణీయకతను వివరించారు. అవసరమైన చోట ఇతర గ్రంథాల్లోని సదృశాంశాలను తీసుకుని పోల్చి తులనాత్మక పరిశీలన చేశారు. సంస్కృత భారతంలోని మూల శ్లోకాలతో కలిపి సాగిన ఈ కథల వివరణ అత్యంత ఆసక్తికరంగా సాగింది.

* * *

**For Copies**
**Padmini**
Cell: 855 889 9478
Visit: https://books.acchamgatelugu.com




**డా.భీంపల్లి శ్రీకాంత్గారి** కవితాసంపుటాలను లోగడ ఇదే శీర్షికల్లో పరిచయం చేశాము. ఆధునిక కవితరీతుల్లో తనదైన సొంతబాటలో సాగుతున్న కవి. తాను సృష్టించిన బాటలో పదిమందీ నడిచేలా చేయగలిగిన ప్రతిభాపాటవాలను సొంతం చేసుకున్న కవి. ఆయన 'మొగ్గలు' అనే నూతన కవితా ప్రక్రియను ఆవిష్కరించి, ఆ ప్రక్రియను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో ఘన విజయం సాధించారు. అనేకమంది యువకవులు ఈ 'మొగ్గలు' వ్రాస్తూ ఉండడం గమనార్హం. ఈ ప్రక్రియలో మొదటి రెండు పంక్తులు విషయం చెబుతూ చివరి, మూడవ, పంక్తి దాని సారాన్ని ఉపమానంగానో, సామెతగానో అభివర్ణించాలి. అలాంటి మొగ్గలు ప్రక్రియలో శ్రీకాంత్ గారు , తన తండ్రి గురించి వ్రాసిన స్మృతికావ్యం ఈ 'నాన్న మొగ్గలు'. 'నాన్న' అనే పదంలోనే వేనవేల భావాలు, స్మృతులు, జ్ఞాపకాలు, ఆత్మీయతలు, అనుబంధాలు పొదిగి ఉంటాయి. వ్యక్తి ఉనికికి మూల కారణం, వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దే మహోన్నతమైన శక్తి 'నాన్న'. నాన్న గుర్తురాగానే మనసు ఆనందతరంగితమౌతుంది. దూరమైన నాన్న ఐతే మనసు బెంగతో మూలుగుతుంది. ఈ 'నాన్న మొగ్గలు ' లో కవి మనసు ఇదే భావాలను వివిధకోణాల్లో ఒక్కో అందమైన 'మొగ్గ'గా, విరియకుండానే పరిమళాలు వెదజల్లే 'మొగ్గ' గా మనలను పలకరిస్తుంది, మన మనసుల్నీ తాకుతుంది. మచ్చుకి కొన్ని 'నాన్న మొగ్గలు' : చిన్నప్పుడు ఎన్ని తులువ పనులు చేసేప్పటికీ / మందలించి వదిలివేసే కరుణామృతమూర్తి / తప్పులు సాధారణమని సంస్కరించేది నాన్న ; పిల్లలే తన లోకమని జీవిస్తూనే / వారి కలలను ఎప్పుడూ నిజం చేస్తుంటడు / పిల్లల కోరికలను తీర్చే కల్పతరువు నాన్న; మాటల మంత్రదండం తినే భయపెట్టిస్తూ / బతుకుదారికి పూలబాటవుతుంటడు / మంచిమాటలే నాన్న నేర్పిన సంస్కారం - ఇలా సాగుతాయి ఈ సంపుటిలోని 'మొగ్గలు'. ప్రతి కవితలోనూ కవికి తండ్రిపట్ల గల ప్రేమ, మమకారం, గౌరవం.. చిక్కగా, చక్కగా ప్రతిబింబిస్తాయి. 'చెలిమి చేసే చెలికాడు', ' గరళాన్ని మింగేటి గరళకంఠుడు', ' 'జీవితానికి బతుకుబాట వెయ్యడం', ' 'బతుకుదారికి పూలబాటవడం', 'ప్రభాత ఉషోదయం' 'తొలకరి జల్లు జలపాతం' లాంటి విలక్షణ ప్రయోగాలు ఈ మొగ్గలు నిండా కనిపిస్తాయి. నాన్నగారి పై ప్రేమను పదేపదే వ్యక్తం చేస్తూ వ్రాసిన భావాలు మళ్ళీమళ్ళీ ఈ పుస్తకంలో ఒక్కింత మార్పుతో పాఠకుల్ని పలకరిస్తూ ఉంటాయి. ఉదా: ఒక మొగ్గలో 'భవితకు బంగారు బాటలు వేసే ' అంటే మరో మొగ్గలో 'భవిష్యత్తుకు బాటవేసే' అంటారు. 'గరళాన్ని మింగే గరళకంఠుడు' అని ఒక మొగ్గలో అంటే 'విషాదాన్ని మింగే గరళకంఠుడు' అని ఇంకో మొగ్గలో అంటారు. 'పుస్తకాలను నా ముందు దీపాలుగా వెలిగించాడు' అని అదే మొగ్గలో తరువాతి పంక్తిలోనే 'పుస్తకాలతో జ్ఞానదీపాలను వెలిగించింది నాన్న' అంటారు. డా.శ్రీకాంత్గారు తన 'మొగ్గలు' కవితా ప్రక్రియతో నాన్నగారికి అర్పించిన నివాళికి నిలువెత్తు నిదర్శనం ఈ 'నాన్న మొగ్గలు' కవితా సంపుటి.

★★★

ప్రతులకు

డా.భీంపల్లి శ్రీకాంత్

ఇ.నెం. 8-5-38

టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్

9032844017

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA